

గుప్తనిధుల తవ్వకాలు

దుండగులను పట్టుకున్న పురావస్తు శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-గుత్తి

చారిత్రాత్మక గుత్తి కోటలో గుప్తనిధుల కోసం అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న దుండగులను పురావస్తు శాఖ సిబ్బంది పట్టుకున్నారు. కర్నూలు, యాడికి, ప్యాపిలి తదితర ప్రాంతాలకు చెందిన పదిమంది దుండగులు గుత్తి కోటకు చేరుకుని ఆదివారం ఉదయం గుప్తనిధుల కోసం తవ్వకాలు సాగించారు. గమనించిన పురావస్తు శాఖ సిబ్బంది కృష్ణచైతన్య, ఆంజనేయులు కలిసి తవ్వకాలను అడ్డుకున్నారు. అక్కడ నుంచి నలుగురు దుండగులు పరారయ్యారు. ఆరుగురు దుండగులను సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు తవ్వకందారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుండగులను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కౌలురైతులసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఈనెల 12వ తేదీన విజయవాడ నుండి మంగళగిరి వరకు జరుగు కౌలు రైతుల పాదయాత్రకు సంబందించిన కరపత్రాలను స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విడుదల చేశారు. ఈసందర్భంగా రంగారెడ్డి, బాలరంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఉన్న కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. 2019 పంట సాగు దారుల చట్టం(సి.సి.ఆర్.సి) ప్రకారం గుర్తింపు కార్డు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో చట్టంలో మార్పులు చేసి కౌలు రైతుకు సులభంగా గుర్తింపు కార్డు మంజూరు చేయాలని, భూ యజమాని సంతకం తొలగింపు సాధనే లక్ష్యంగా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 5 నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాతాలు, సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు. పంటరుణాలు, రాయితీ ఎరువులు విత్తనాలు, పంట నష్టపోతే పరిహారం దక్కక కౌలు రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదని అన్నారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అయిన నేపథ్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డు రావడం లేదని అన్నారు. భూ యజమాని సంతకంతో పని లేకుండా గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సంయుక్తంగా గ్రామ సభలు నిర్వహించి అసలైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, బీమా, ఈ క్రాప్, రాయితీపై రుణాలు, పంట అమ్ముకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పరిహారం సౌకర్యం కల్పించి కౌలు రైతుల ఆత్మహత్యలు నివారించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు ప్రధాన అంశమని దీనికి ప్రధాన ఆటంకంగా ఉన్న భూ యజమాని సంతకం తొలగించాలన్న డిమాండ్ సాధన తమ సంఘం లక్ష్యమన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి భూ యజమాని కౌలు రైతులతో గ్రామ సభ నిర్వహించి అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఋణాలు ,బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం12 న విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయం వరకు నిర్వహించే రాయబార పాదయాత్ర కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కృష్ణమూర్తి, నాగమణి, భాస్కర్, రామాంజనేయులు, నాగరాజు, వెంకటనారాయణతో పాటు కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు

హామీలతో మరోసారి మోసానికి చంద్రబాబు యత్నం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు మరోసారి ప్రజలనుమోసం చేసేందుకు మహనాడులో హామీలు గుప్పించారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉషాశ్రీ అధ్యక్షతన జరిగిన వైసిపి నాలుగేళ్ల పాలన విజయోత్సవ సభకు మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంలో నిర్వహించిన గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి ఉషాశ్రీచరణ్ సంపూర్ణంగా విజయవంతం చేశారని అభినందించారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఉషశ్రీ అధిక మెజార్టీతో గెలవబోతోందని జోస్యం చెప్పారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసి సుపరిపాలన అందించిన సిఎంగా జగన్ పేరొందారన్నారు. చంద్రబాబు మహిళలకు కడియాలు, ఇంటికో ట్రాక్టర్ ఇస్తానని బూటకపు హామీలు గుప్పిస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. చంద్రబాబుకు దమ్ముంటే ఒంటరిగా పోటీచేయాలని సవాల్ విసిరారు. ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జేపీ నడ్డ తదితర ప్రముఖులతో మంతనాలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మరోసారి జగన్‌ను సిఎంగా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజవర్గ పరిశీలకులు ఎంఆర్‌సి రెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రోడ్డు పనులు చేస్తున్న చోట కింద వేలాడుతున్న కరెంటు వైర్లు

రోడ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు - ప్రయాణికులకు ప్రాణభయం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లపై కరెంటు తీగలు వేలాడుతుండడంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పుట్లూరు నుంచి నారాయణరెడ్డిపల్లె, బాలాపురం నుంచి నారాయణరెడ్డి పల్లె, పుట్లూరు నుంచి తక్కలపల్లికు వెళ్లే రోడ్లలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. మనుషులకు అదే అంత తక్కువ ఎత్తులో వైర్లు వేలాడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని స్థానికులు వాపోతున్నారు. ఏదైనా జరగరానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండానే అప్రమత్తమై విద్యుత్ వైర్లను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఎఇ విజయుడు వివరణ కోరగా వైర్లు తక్కువ ఎత్తులో ఉండడం సహజమేనన్నారు. అయితే రోడ్లు మరమ్మతులు చేసేటప్పుడు కాంట్రాక్టర్లే వాటి ఖర్చు భరించాల్సి ఉంటుందన్నారు. వాళ్లు ఖర్చు భరించినప్పుడే తాము మరమ్మతులు చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ కరుణసాగర్‌రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రతి ఒక్క వాహనదారునికి, డ్రైవర్లకు లైసెన్సులు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాల జరగకుండా నివారణ చర్యలు చేపడతామని హిందూపురం రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ఆదివారం మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.



ప్రశ్న : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటి?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని గతంలో పుట్టపర్తిలో ఏర్పాటు చేశాం.కానీ కొన్ని అనివార్య కారణాల వలన హిందూపురంలోనే కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం వాహన లైసెన్సులు పొందవలసిన వారు హిందూపురం నుండి పొందుతున్నారు. వాహనదారులు ఎక్కువగా ఉన్న కారణంగా హిందూపురం నుండే కొనసాగిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం.

ప్ర: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి, కాలం చెల్లిన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లాలో ఆటో రిక్షాలు, గూడ్స్ వాహనాల పాటు ఇతర వాహనాలు మొత్తం 2,77,235 వాహనాలు ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేయలేకపోవటంతో హిందూపురం నుండి కార్యకలాపాలు సాగిస్తున్నాం. వాహన లైసెన్సులు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు తదితర ఆన్లైన్ కార్యకలాపాలు ప్రస్తుతం హిందూపురం నుండి కొనసాగిస్తున్నాం. ఇక్కడినుండే అన్ని చెల్లింపులు జరుగుతున్నాయి.

ప్ర : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరక్కుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు, వాహన యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటున్నాం. లైసెన్సు లేనివారు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, భారీ వాహనాలు నడపకుండా చర్యలు చేపడుతున్నాం. అలాంటి వారిని ట్రాన్స్‌పోర్టు అధికారులు గుర్తించి వారికి అవగాహన కల్పించి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. లైసెన్సు మంజూరు చేయడానికి మేళాలు ఏర్పాటు చేసి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్సులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : బడిబస్సుల కండీషన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : పాత బస్సులను, కాలం చెల్లిన బస్సులను నడిపే పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నాం. అలాంటి బస్సులను లైసెన్స్, పరిమితులు పునరుద్ధరణకు వచ్చినప్పుడు వాటినిపరిశీలించి కండిషన్ సరిగా లేని వాటిని తిరిగి పంపుతున్నాం. వాటి పనితీరును పరిశీలించి పర్మిట్లు మంజూరు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాల వారైనా బస్సులు నడిపితే వారిపై కేసులు పెడతాం. అలాంటి బస్సులను సీజ్ చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీ సత్య సాయి జిల్లాలో కాలం చెల్లిన బడి బస్సులకు అనుమతులు మంజూరు చేయం.



రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణసాగర్‌రెడ్డి

చంద్రబాబు, కరువు... కవల పిల్లలు

విప్ కాపు రామచంద్రారెడ్డి

ఘనంగా ఏరువాక కార్యక్రమం

ప్రజాశక్తి-కణేకల్లు

టిడిపి అధినేత చంద్రబాబు, కరువు కవల పిల్లలు అని ఆయన ఎప్పుడు వచ్చినా కరువు ఖచ్చితంగా వస్తుందని విప్ కాపు రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పొలంలో నాగలికి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. అదే చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు విలయతాండవం చేసి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. అదే జగన్ సిఎం అయ్యాక సకాలంలో వర్షాలు కురిసి రైతులు సిరి సంపదలతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచి గోపాల్‌రెడ్డి, ఎంపిటిసి కేశవరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, సోమలింగ, శివరాంరెడ్డి, జయచంద్ర, శ్రీధర్, సొసైటీ అధ్యక్షులు తిమ్మప్ప కేశవరెడ్డి, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, మరెన్న, రెవెన్యూ అధికారి గోవిందురెడ్డి, ఎఒ శ్రవణ్, చెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వొద్దు..

విద్యుత్ కాంట్రాక్టర్లకు మండలంలోని రైతులు ఎవరూ డబ్బులు ఇవ్వకూడదని విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు రూ.లక్షలు అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇందుకు విప్ కాపు స్పందిస్తూ కాంట్రాక్టర్లు ఎవరైనా రైతుల దగ్గర డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఏరువాక సందర్భంగా పొలం దున్నుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ఆకతాయిలకు అడ్డాగా నార్పల క్రీడామైదానం

మితిమీరిన మందుబాబుల ఆగడాలు

పట్టించుకోని అధికారులు - క్రీడాకారులు, వాకర్ల అసహనం



నార్పల ఇండోర్ స్టేడియంలో తాగి పడేసిన మద్యం సీసాలు, తినుబండారాలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని క్రీడా మైదానానికి ప్రధాన గేటు లేకపోవడంతో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు అధికమయ్యాయి. రాత్రిళ్లు ఇండోర్ స్టేడియం ముందే కొందరు ఆగతాయిలు మద్యం తాగి సీసాలతోపాటు మిగిలిన తినుబండారాలను అక్కడే పడవేస్తున్నారు. దీంతో క్రీడాకారులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏప్రిల్ 26వతేదీన సిఎం జగన్ విద్యావసతి దీవెన పథకం ప్రారంభోత్సవానికి మండల కేంద్రానికి వచ్చిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా స్థానిక క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. దీంతో క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అంతేగాకుండా అక్కడక్కడ పడిపోయిన ప్రహరీని నిర్మించారు. అయితే సిఎం హెలిపాడ్ నుంచి బహిరంగ వేదికకు బస్సులో వెళ్లడానికి క్రీడా మైదానం ప్రధాన గేటును తొలగించడంతోపాటు కొద్దిభాగం ప్రహరీని కూడా తొలగించారు. తర్వాత ప్రహరి నిర్మించడంతోపాటు ప్రధాన గేటు వేయడాన్ని మరిచారు. దీంతో ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలు తథాతథంగా కొనసాగుతున్నాయి. మందుబాబులు రాత్రిళ్లు ఇండోర్ స్టేడియం ముందే మద్యం తాగడంతోపాటు తినుబండారాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో క్రీడాకారులు, వాకర్లు అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తొలగించిన క్రీడామైదానం ప్రధాన గేటును తిరిగి ఏర్పాటు చేసి ఆకతాయిలు, మందు బాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు, క్రీడాకారులు కోరుతున్నారు.



ముఖ్యమంత్రి రాక సందర్భంగా తొలగించిన క్రీడా మైదానం ప్రధాన గేట్

జీడిపల్లి ముంపు బాధితులకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని జీడిపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన రిజర్వాయర్ కారణంగా ఊట నీటితో తీవ్ర ఇబ్బందులు ప్రజలకు ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం కళ్యాణదుర్గంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విజయోత్సవ సభలో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విశ్వేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీడిపల్లి పరిహారానికి సంబంధించిన సమస్యపై గ్రామస్తులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత సిఎం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో జీడిపల్లి గ్రామ సమీపంలో హంద్రీనీవా రిజర్వాయర్ నిర్మించారన్నారు. అప్పట్లో రైతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లించడానికి రూ.82.12 కోట్లు నిధుల విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అయితే దశాబ్దకాలంగా రైతులకు అమలు చేయాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పటికీ పెండింగ్‌లో ఉందన్నారు. కావున రైతులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.82.12 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ జీడిపల్లి గ్రామ ప్రజలు, రైతులు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే విశ్వ వినతి



ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌కెయు విద్యార్థులు

ప్లాస్టిక్ నియంత్రణతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

ప్లాస్టిక్ నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బిశ్వరాజ్యసమితి అవార్డు గ్రహీత జిల్లా యువ అధికారి బిసాటి భరత్ అన్నారు. ఆదివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్టియన్ మాస్టర్ మైండ్స్ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలన్నారు. అనంతరం యువతకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గురుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, కరస్పాండెంట్ బాలయ్య ప్రిన్సిపాల్ రమేష్, కె.జయమూర్తి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు తుకారాం, నందిత, రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎస్‌కెయు విద్యార్థులు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎజిఐఎస్, ఎడిఎ ఫౌండేషన్, ఎస్‌కె యూనివర్శిటీ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఇందులో భాగంగా సేవ్ బర్డ్స్, సేవ్ ట్రీస్ నినాదంతో చిన్నా, పెద్దా కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమౌళి, ప్రొఫెసర్ నాగభూషణం, ఎజిఐఎస్ వైస్‌ప్రెసిడెంట్ దామోదర్, కిషోర్‌రెడ్డి, శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ అనంతపురం ఫౌండర్ ఎజి అనిల్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు సంపూర్ణ సహకారం

డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతిభ ఉన్న బలిజ విద్యార్థులకు తమవంతు సంపూర్ణ సహకారం ఉంటుందని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య తెలిపారు. 2022-23 సంవత్సరములో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న బాలాజీ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు సత్ ప్రవర్తనతో క్రమశిక్షణగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతిభ ఉండి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బలిజ విద్యార్థులకు ఏ విధమైన సహాయం అందించడానికైనా సంఘం సిద్ధంగా ఉందన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా రాణించాలని పిలుపునిచ్చారు. గౌరవాధ్యక్షులు బల్లారి వెంకట్రాముడు మాట్లాడుతూ విద్య మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లం విజయభాస్కర్, జీ.వీ.రమణ, శ్రీనివాసులు, రామకృష్ణ, నాగేంద్ర, నాగేంద్రప్రసాద్, రవికుమార్, ట్రెజరర్ కోనేటి సాయిప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ రమేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

వేసవి శిక్షణ శిబిరంతో విజ్ఞానం

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రంథాలయాల ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వేసవి శిబిరం వల్ల విద్యార్థులకు కలిగే లాభాలను అడిగి తెలుసుకున్నారు. మిగతా సమయాల్లో కూడా గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ప్రతాపరెడ్డి, రీసోర్స్‌పర్సన్లు శ్రీనివాస్, శాలినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

డిగ్రీ మూడు సంవత్సరాలే నిర్వహించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఇటీవల ప్రభుత్వం డిగ్రీకోర్సును నాలుగు సంవత్సరాలు చేస్తూ జీఓ వేయడం తగదని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాల నుండి నాలుగు సంవత్సరాలకు పెంచడంతో పేద మధ్యతరగతి విద్యార్థులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్నారు. అంతేకాకుండా ఫీజులు పెరిగిపోయి ట్యూషన్లకు వెళ్లే వారి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతుందన్నారు. వీటన్నిటి పర్యవసానంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదముందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి డిగ్రీ కోర్సును మూడు సంవత్సరాలకే కుదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్, అంజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

అందుబాటులో వరి, కంది, పెసర విత్తనాలు

ఉరవకొండ : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రెడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వరి, కంది, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి బిపిటి 5204 రకం 30 కిలోల బస్తా రూ.1200, కంది పిఆర్‌జి 176 ఎల్‌ఆర్‌జి రకం కిలో రూ.120, పెసర ఎల్‌జిజి 42 ఎల్‌ఆర్ రకం కిలో రూ.125 ధర నిర్ణయించినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సెల్. 70135 71755, 70320 58368, 99896 23825, 94933 44440 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

8న మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక

రాయదుర్గం రూరల్ : ఈనెల 8న మండల ఉపాధ్యక్షుని ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి రవిశంకర్‌రెడ్డి, ఎంపిడిఒ కొండయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కెంచానపల్లి ఎంపిటిసిగా ఉన్న సత్యనారాయణ ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు.

ఘనంగా జేష్టాభిషేక మహోత్సవం

ఉరవకొండ : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రపంచంలోనే దక్షిణాభి ముఖంగా కొలువైన ఏకైక బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం జేష్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆర్యరుషి మహారుద ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ పూజల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన నాటి శ్రీకృష్ణదేవరాయల వంశస్థుల మునిమనవడు శ్రీకృష్ణదేవరాయలు కుటుంబ సమేతంగా సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.


పూజలు చేస్తున్న ఎల్వీ సుబ్రమణ్యం దంపతులు

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యుగంధర్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజలందరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ పిలుపునిచ్చారు. పొగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఆదివారం నగరంలోని తపోవనం క్రికెట్ స్టేడియంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పొగాకుకు దూరంగా ఉంటామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ఆహారం తీసుకోవాలేగాని, పొగాకు కాదన్నారు. కావున ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. పొగాకు వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు పర్యావరణ కాలుష్యం అవుతుందన్నారు. పొగాకు ఏ రూపంలో వాడినా మానవాళి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాల్లో సిగరెట్, పొగాకు ఉత్పత్తులను అమ్మకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా ధూమపానం వల్ల 8లక్షల మిలియన్ మంది ప్రతి సంవత్సరం చనిపోతున్నారన్నారు. పొగాకు తాగడం వల్ల మనిషి అవయవాలపై ప్రభావం చూపించి క్యాన్సర్‌కు కారణం అవుతుందన్నారు. అలాగే బహిరంగ ధూమపానం చేసినా, ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని 100 గజాలలోపు ఎవరైనా దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రూ.200 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఏ రూపంలో వినియోగించినా మనకే నష్టం అన్నారు. ఆర్థికంగా సామాజికంగా కుటుంబ పరంగా అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. కురుగుంట మెడికల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా 60 రోజులు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించనున్నట్లు తెలిపారు. పొగాకు నియంత్రణ జిల్లా సోషల్ వర్కర్ శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు సిఒటిపిఎ యాక్ట్-2003, టిఒఎఫ్ఇఐ పటిష్టంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రామ్ కన్సల్టెంట్ రామాంజనేయులు, మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణం చేయిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యుగంధర్

వాల్మీకులు అన్నిరంగాల్లో రాణించాలి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు - ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-అనంతపురం

వాల్మీకులు అన్నిరంగాల్లో రాణించాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వాల్మీకి భవన్‌లో పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు సంఘం అధ్యక్షుడు ఆక్కులప్ప అధ్యక్షతన ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అనేక మంచి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం సంతోషకరమన్నారు. ఇలాంటి పురస్కారాలను వాల్మీకి విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ గతంలో ఇలాంటి ప్రతిభ పురస్కారాలు నిర్వహించినప్పుడు వాల్మీకి కుటుంబ పిల్లలు చాలా తక్కువ మంది హాజరయ్యే వారన్నారు. అయితే నేడు వందల సంఖ్యలో వస్తున్నారంటే వాల్మీకి బిడ్డల భవిష్యత్తు మంచిమార్గంలో వెళ్లిందని అర్థం అవుతోందన్నారు. ఇది ఒక మంచి సంకేతం అన్నారు. కర్నూలు జిల్లా వాల్మీకి నాయకులు డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో వాల్మీకులు వెనుకబడి ఉన్నారన్నారు. ఆయా కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే వారి పిల్లల మంచి చదువులతో రాణించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఆదినారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ తలారి ఆదినారాయణ, అమరావతి ఆసుపత్రి ఎండి ముత్యాలన్న, ఎడిసిసి బ్యాంకు అధ్యక్షురాలు లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులు, నాయకులు రామలింగయ్య, రవి, చంద్ర, ఓబులేశ్, శివయ్య, గంగాధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న వాల్మీకి నాయకులు

సాయంకాలం.. సంతోష సమయం..

బిందు ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌కు ప్రజల ఆదరణ

ప్రజాశక్తి-అనంతపురం

వేసవి సెలవులు కావడంతో పిల్లలతో కలిసి కుటుంబం సాయంకాల సమయంలో సంతోషంగా గడపడానికి నగరంలోని గుత్తి రోడ్డు కెటీఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన బిందు ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు నాగ, రఘు, గోపాల్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలకు ఆటవిడుపు కోసం తాము ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం బిందు ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో రోబోటిక్ యానిమల్స్‌ను ఏర్పాటు చేసిన తెలిపారు. పిల్లల మొదలుకుని పెద్దల వరకూ రోబోటిక్ జంతువుల ప్రదర్శనను తిలకిస్తూ ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పిల్లలకు అవసరమైన ఆట బొమ్మలు మహిళలకు అవసరమైన గృహ సంసార వంటి వస్తువులు, వస్త్రాలు ఆట బొమ్మలు తినుబండారాల ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సుమారుగా 60 స్టాల్స్ పైగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా వినోదాన్ని పంచే పంచుకునేందుకు పిల్లలు ఎంతగానో ఇష్టపడే జాయింట్ వీల్, కొలంబో, బ్రేక్ డాన్స్, సోలంబో, ట్రైన్ రంగుల రాట్నం, ఎయిర్ బెలూన్ వంటి ఐటమ్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తినుబండారాల విషయంలో ఆగ్రా చాట్ పానీ పూరి బడా బజ్జి అప్పడం వంటివి ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రోబోటిక్ జంతువులతో స్వాగతం ఆహ్వానం పలుకుతున్న బిందు ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు.


ఎగ్జిబిషన్ ముందు ఆకర్షిస్తున్న బొమ్మలు

వికలాంగుల అరెస్టు హేయం

కళ్యాణదుర్గం : శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వికలాంగులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. విజయవాడ సభను ఎక్కడ అడ్డుకుంటారన్న భయంతో ఈవిధంగా చేయడం ఎంతవరకూ సమంజసమన్నారు. కుందుర్పి మండల కేంద్రంలో వికలాంగుల భవనం ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని స్థానిక వైసిపి నాయకులు కబ్జా చేశారన్నారు. ప్రభుత్వ పెద్దలకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో శాంతియుత నిరసన వ్యక్తం చేయడం అప్రజాస్వామికమా.. అని ప్రశ్నించారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈవిధంగా జరుగుతూ ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. వికలాంగుల భవన స్థలాన్ని కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోకుంటే సిపిఎం తరఫున పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అశ్వర్థ నారాయణస్వామి కల్యాణం

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర స్వామివార్ల కళ్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు అశ్వర్థనారాయణస్వామి దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అశ్వర్థ నారాయణస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి-నార్పల

వాహనదారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఆటోవాలాలు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక గూగూడు రోడ్డు సంత మార్కెట్ రోడ్లలో ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని స్థానిక గూగూడు రోడ్డు, సంత మార్కెట్ రోడ్డు, బస్టాండ్ కూడలి తదితర ప్రాంతాల్లో దుకాణాలు, హోటళ్ల ముందు ద్విచక్ర వాహనాలను ఎక్కువసేపు ఉంచనివ్వకుండా దుకాణదారులందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మరోసారి వాహనాలను ఉంచితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే వాహనాలు వదిలి వెళితే సెల్.94901 07853 నెంబర్‌కు వాట్సప్ సమాచారం అందజేయాలని కోరారు.


తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

గొలుసు దొంగలతో అప్రమత్తంగా ఉండాలి

బంగారు గొలుసులు చోరీ చేసే దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో జిల్లాలో జరుగుతున్న బంగారు గొలుసుల చోరీల దృష్ట్యా మహిళలు ఒంటరిగా బయటికి వెళ్తున్నప్పుడు విలువైన బంగారు ఆభరణాలు ధరించకూడదన్నారు. ఒకవేళ వేసుకున్నా మెడ భాగాన్ని చున్నీతో గానీ, చీరకొంగుతో గానీ పూర్తిగా కప్పుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా మీ చుట్టూ సంచరిస్తే వెంటనే డయల్ 100కి కాల్ చేయాలని కోరారు.

మెరుగైన విద్యనందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-ఉరవకొండ

నాలుగు నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ధ్యేయంగా నిస్వార్థ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకటేసులురాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిటెక్, బిఇడి పూర్తి చేసి ఉద్యోగం కోసం అన్వేషిస్తూ సేవాభావం కలిగిన నిరుద్యోగులకు ఉదయం, సాయంత్రం వేళల్లో రోజూ మూడు గంటల పాటు ఉరవకొండలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగు నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బోధించేందుకు సహకరించాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు సెల్.99634 98250ను సంప్రదించాలని కోరారు. ఎంపికైన వారికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకూ గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గుత్తి : బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుత్తి వాసి శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానిక పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన అంగడి శ్రీరాములు కుమారుడు శ్రీకర శ్రీనివాసులు (45) బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం బెంగళూరు శివారులో అతడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

మాజీ ఎంపిపిపై దాడి

గుత్తి : పట్టణంలోని ఉప్పర వీధిలో నివాసం ఉండే మాజీ ఎంపిపి లీలావతిపై ఆదివారం కొందరు దాడి చేశారు. ఆమె ఇంటి సమీపంలో ఉన్న రామాంజనేయులు అకారణంగా లీలావతితో గొడవపడ్డాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడ్డ ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుత్ మోటారు చోరీ

గుత్తి : మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఓ రైతుకు చెందిన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణ మిరప తోటలో ఉన్న విద్యుత్ మోటారును ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు చోరీ చేసుకుని వెళ్లారు. బాధిత రైతు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మామిడూరులో ఘర్షణ..ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని మామిడూరు గ్రామంలో ఆదివారం ఇరువర్గాల ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరాములు, రామాంజనేయులు వర్గాలు చిన్నపాటి విషయానికి గొడవపడ్డారు. పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. దాడిలో రామాంజనేయులు సోదరి వెంకటరమణమ్మకు శ్రీరాములు కుమారుడు రాముకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రజాపురం హెల్త్ అసిస్టెంట్ మృతి

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ఆదివారం మృతి చెందారు. ఆయన 15 రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జగన్మోహన్‌రెడ్డి మరణించినట్లు బంధువులు తెలిపారు.

12న ఎన్‌జి రంగా విశ్వ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం

బుక్కరాయసముద్రం : ఈనెల 12వ తేదీన రెడ్డిపల్లిలో ఉన్న ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన మేలైన విత్తనాల ప్రదర్శన, విక్రయాలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ముడి'కి కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారం

అనంతపురం : ప్రతి యేటా ప్రతిష్టాత్మకంగా ఇచ్చే కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారం ఈసారి డాక్టర్ శాంతినారాయణ రచించిన ముడి (శ్రీ ఆత్మగౌరవ నవల) నవలను వరించింది. ఈ పోటీకి 25 నవలలు రాగా శాంతినారాయణ రచించిన ముడి నవలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసినట్లు డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 12న చిత్తూరులో జరిగే సాహిత్య సభలో శాంతి నారాయణకు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

గాంధీ హరిజన హాస్టల్ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

ఉరవకొండ : పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ తాలూకా ఉద్యోగుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కోర్ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం తాలూకా గాంధీ హరిజన హాస్టల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా సేట్ డిపార్ట్‌మెంట్ ఎస్ఏ సాకే దేవిడ్, ఉపాధ్యక్షులుగా డిప్యూటీ తహశీల్దార్ మీనుగ నరేష్, తొండం చంద్రశేఖర్, మల్లికార్జున, అంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా సింగాడి దుర్గాప్రసాద్, ఎం.ఎల్లప్ప, సహాయ కార్యదర్శిగా సి.గంగన్న, ట్రెజరర్‌గా ఎస్.జగదీష్ తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ అరిజన హాస్టల్ కోర్ కమిటీ సభ్యులు తిప్పయ్య, ఎర్రి స్వామి, ఓబులేసు, రామకృష్ణ, గోపాల్, ఆనంద్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


గాంధీ హరిజన హాస్టల్ ఉద్యోగుల నూతన కమిటీ సభ్యులు

టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా 'ఏరువాక'

అనంతపురం కలెక్టరేట్ : నగర సమీపంలోని నారాయణపురం పంచాయతీ నాగిరెడ్డిపల్లె గ్రామంలోని పొలంలో టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాయల్ రఘు ఆధ్వర్యంలో ఎద్దులతో కాడికట్టి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం పొలం దున్నారు. తర్వాత వరి కుప్పలను కొట్టి వడ్లను వేరు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు రమణారెడ్డి, రైతు ఉపాధ్యక్షులు నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్ మాట్లాడుతూ పూర్వకాలం నుంచి పెద్దలు వ్యవసాయం చేయాలంటే ఏరువాక పౌర్ణమి రోజు ఎద్దులకు పూజలు చేసిన తర్వాత వ్యవసాయ పనులు ప్రారంభించేవారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా ఘనంగా ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మారుతీకుమార్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తేజస్విని, మాజీ కార్పొరేటర్ సరళ ముక్తియార్, కూచి హరి, బంగి నాగ గోపాలగౌడ్, మార్కెట్ మహేష్, వస్సూర్, డైమండ్ రఫీ, జెఎం బాషా, పూల బాషా, వసుంధర, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, మహేశ్వరి, చెరుకుతోట పవన్, ఆయేషా, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : రైతు సంక్షేమమే టిడిపి లక్ష్యమని టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి సూచన మేరకు టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని బండ్లపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎనిగాపప్ప, సర్పంచ్ వెంకటనారాయణమ్మ, సుధాకర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జ్ మల్లేరెడ్డి, శివారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి కుళ్లాయప్ప, పిఎల్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిటిసి రామచంద్రారెడ్డి, తెలుగు యువత చంద్రబాబు, మాజీ సర్పంచి బొగ్గు నారాయణస్వామి, బి.ప్రతాప్‌రెడ్డి, ఎల్.వెంకట నారాయణరెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, సంజీవరెడ్డి,రఘు రాములు, గంగాధర్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


ఏరువాక సందర్భంగా వరి నూర్పిడి చేస్తున్న టిడిపి నాయకులు